
క్లుప్తంగా

పారిశుధ్యానికి ప్రాధాన్యత



పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టిన దృశ్యం

కేవీపల్లి : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ అన్నారు. బుధవారం మండలంలోని మహల్‌రాజుపల్లెలో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. నీటి ట్యాంకులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కవేయరాదని, తమ ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రాకూడదు



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ అద్దె బస్సులు సమయ పాలన పాటించాలని, ప్రయాణికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆర్టీసీ డిఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయంలో అద్దె బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. బస్సులు పికప్ బాగా పెట్టాలని, స్పేర్ టైర్లు ఉంచుకోవాలన్నారు. డ్రైవర్లు అన్ని స్టేజీలలో ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, గీత తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

పీలేరు రూరల్ : ఏపీఎస్ ఆర్టీసీలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం డీఎం కార్యాలయంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రయాణికుల తమ దృష్టికి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు.

మధ్యాహ్న భోజనం రుచిగా చేయాలి



మధ్యాహ్న భోజనంపై విచారిస్తున్న ఎంఈఓ రాజగోపాల్

మదనపల్లె సిటీ : మధ్యాహ్న భోజనం రుచిగా చేయాలని ఎంఈఓ-2 రాజగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తక్కువ మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో విచారణ చేశారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరూ మధ్యాహ్నభోజనం తినేలా చూడాలన్నారు. సమావేశంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు కార్డులు తీసుకోవాలి

– జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

వాల్మీకిపురం : ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా కౌలు కార్డులను తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని జర్రావారిపల్లిలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశెనగలో విత్తన శుద్ధి, అంతర పంటల సాగు, లింగాకర్షక బుట్టలు, పసుపు, తెలుగు జిగురు అట్టలు ఉపయోగాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ వాణిశ్రీ, ఏవోలు హేమలత, రమేష్‌రాజు, సిబ్బంది బాబు, అబ్దుల్ ఖాదర్, గిరీష్, స్వాతి, హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ కోసం బడ్జెట్ పెంచాలి

మదనపల్లె సిటీ : బాలల రక్షణలో భాగంగా మిషన్ వాత్సల్య కోసం కేంద్ర బడ్జెట్‌లో మార్పు లేదని, ఇందుకు బడ్జెట్ పెంచాలని ఫోర్డు డైరెక్టర్, బాలల హక్కుల ఐక్యవేదిక అధ్యక్షురాలు జిల్లా లలితమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ విద్యా విషయంలో సమగ్రశిక్షా అభియాన్,మైనార్టీ పోస్టుమెట్రిక్, నవోదయ, కేంద్రీయ విద్యాలయ సంబంధించి బడ్జెట్‌లో నిధులు పెంచడం అభినందనీయమన్నారు. ఆరోగ్య పోషణ విషయంలో అంగన్‌వాడీ, పోషణలో నిధులు పెంచారన్నారు. బాలల సంక్షేమం కోసం తమ వంతు కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వానదేవుడా..చుట్టపు చూపులేనా?

- జిల్లాలో వేరుశనగ సాగు అత్యల్పం
- విత్తనాలు వేసింది 20 శాతం మాత్రమే
- ఈ ఏడాది వేరుశనగ సాగు ప్రశ్నార్థకమే
- ఆందోళనలో అన్నదాతలు

కురబలకోట : వేరుశనగ రైతుల పట్ల వరణుడు ముఖం చాటేశాడు. సకాలంలో సబ్సిడీ వేరుశనగ కాయలు తీసుకుని దుక్కులు దున్ని విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఆశాజనకంగా వర్షాలు పడకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈసారి రైతుల ఆశలను వర్షం అడియాశలు చేసింది. ఈనెలలో అప్పుడప్పుడు వర్షం వచ్చినట్లుగా మేఘాలు కమ్ముకోవడం తప్ప చినుకు మాత్రం రాలడం లేదు. ఇంకా 80 శాతం మంది విత్తనాలు వేయలేదు. అన్నమయ్య జిల్లాలో ఈసారి 45 వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు తొమ్మిది వేల హెక్టార్లలో మాత్రమే విత్తనాలు వేసినట్లు జిల్లా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత తక్కువ సాగు కాలేదని వ్యక్తమవుతోంది. జూన్‌లో వర్షాలు పడ్డప్పుడు విత్తనాలు వేసిన రైతులు కూడా వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. కార్తెలు ముగుస్తున్నాయి. ఎందుకో వరణుడు శీతకన్ను వేశాడు. సాగు కోసం దుక్కులు ఇతర పనులకు ఖర్చు పెట్టిన పెట్టుబడులు నేలపాలైనట్లేనని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. మొత్తంగా చూస్తే ఈసారి వేరుశనగ సాగు ప్రశ్నార్థకమనే చెప్పవచ్చు.



కురబలకోటలో విత్తనాలు వేయక బీడుగా ఉన్న పొలం

విత్తనాలు వేస్తే నష్టమే



నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. సకాలంలో వర్షాలు పడక విత్తనాలు వేయలేదు. వేరుశనగ విత్తనాలు వేయడానికి అదును దాటిపోయింది. ఈవారంలో వర్షాలు పడి వేసినా ఆశించిన దిగుబడి రాదు. గడ్డి ఎక్కువ వస్తుంది. ఖర్చులు ఎక్కువ వస్తాయి. అంతేకాదు ఆశించిన దిగుబడి రాదు. ఒక వేళ వరణుడు కరుణించి వర్షం పడి విత్తనాలు వేసినా పంట కూడా ఆశాజనకంగా రాదు. ఏ విధంగా చూసినా రైతుకు నష్టమే.

– రెడ్డెప్పరెడ్డి, చెరువుకిందపల్లె, తంబళ్లపల్లె మండలం

ఆశలు వదిలేసినట్లే



వర్షం పడితే రెండు ఎకరాల్లో విత్తనాలు వేయడానికి సిద్ధం చేసుకున్నా. అక్కడక్కడా జూన్‌లో వర్షాలు పడ్డా కొందరు మాత్రమే వేశారు. చాలా మంది వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. నెలాఖరులో ఉన్నాం. వర్షాలు పడినా విత్తనాలు వేసినా ఫలితం ఉండదు. వేరుశనగ రైతుల పట్ల ఈసారి వరుణుడు ఎందుకో శీతకన్ను వేశాడు. నవంబరు లేదా డిసెంబరులో బావుల కింద వేసుకోవాల్సిందే. అప్పుడయితే దిగుబడి ఆశాజనకంగా వస్తుంది.

– కాశర్ల కృష్ణమూర్తి, ములకవారిపల్లె, కురబలకోట మండలం

అవకాశం ఉంది



వేరుశనగ విత్తనాలు వేసుకోడానికి వారం వరకు టైముంది. ఈసారి జూన్‌లో వర్షాలు పడ్డాయి. అక్కడక్కడా రైతులు విత్తనాలు వేశారు. ఈనెలలో పూర్తిగా వర్షం పడలేదు. జిల్లాలో చాలా మంది రైతులు విత్తనాలు వేయలేకపోయారు. ఇప్పటి వరకు 20 శాతం మంది మాత్రమే విత్తనాలు వేశారు. ఇంకా 80 శాతం మంది వేయాల్సి ఉంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈసారి ఈ పరిస్థితి ఏర్పడింది.

– బి. చంద్రా నాయక్, జిల్లా వ్యవసాయాధికారి

మురుగు కాలువల్లో పూడికతీత పనులు

నగర పంచాయతీ కమిషనర్ మనోహర్



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

బి.కొత్తకోట : పారిశుద్ధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్.మనోహర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక బీసీ కాలనీలో కాలువల్లో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. స్వయంగా పనులను పర్యవేక్షించి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలో ఒక్క డయేరియా కేసు కూడా నమోదు కాకుండా బాధ్యత అందరికీ ఉందన్నారు. ఇప్పటికే దోమల నివారణ కోసం ఫాగింగ్ పనులు పూర్తి చేశామన్నారు. ప్రణాళిక బద్ధంగా చేపట్టిన పారిశుద్ధ్య పనుల నిర్వహణ పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు కూడా సహకరించాలని విన్నవించారు. ఇళ్లలోని చెత్తను వీధుల్లో పారబోయకుండా డస్ట్ బిన్ల ద్వారా తొట్టెల్లో పోయాలని కోరారు. ప్రజలకు ఏ సమస్య ఉన్న తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని మనోహర్ కోరారు.

జీవనశైలి వ్యాధుల నియంత్రణ సాధ్యం



మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : జీవనశైలి వ్యాధుల నియంత్రణ సాధ్యమేనని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని గాండ్లపల్లెలో మధుమేహం – జాగ్రత్తలు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయకపోవడంతో రక్తములో చెక్కర స్థాయి ప్రతికూలత గల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య వస్తాయన్నారు. మంచి అలవాట్లు అలవర్చుకుంటే ఆరోగ్యంగా జీవించగలమని తెలిపారు. ధూమ పానం, మద్యపానంకు, అధిక ఒత్తిడికి, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. నిత్యం వ్యాయామం, తాజా ఆకు, కాయగూరలతో మితాహారం భుజించాలన్నారు. లేకుండా మధుమేహం వ్యాధి తీవ్రత అధికమై అందత్వం, మూత్రపిండాల వైఫల్యం, గుండె, నరాలు తదితర అవయువాలపై చెడు ప్రభావం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం రేణుక, సీహెచ్‌వో రాజేశ్వరి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి

కలకడ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణంలో నాటిన మొక్కలు, అందుతున్న నీటి సౌకర్యాలను పరిశీలించారు. నాటిన మొక్కలను పోషించి కాపాడాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన కనీస సౌకర్యాలను పరిశీలించి ఉత్తమ వైద్యసేవలు అందించాలన్నారు. సీజనల్‌వ్యాధుల పట్ల సిబ్బందిచే అవగాహన కల్పించి ప్రభుత్వం అందించే మందులు, టీకాలు, నమోదు, సర్వే వివరాలను అడిగితెలుసుకున్నారు. వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున విద్యుత్ సౌకర్యం, వీధిదీపాల ఏర్పాటు సమస్య ఉందని తెలియజేయగా వెంటనే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి దేవేంద్రను ఆదేశించారు. నీటి ట్యాంకుల పరిశుభ్రతపై పంచాయతీలు శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

వాల్మీకిపురం : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుంది. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్లస్ హెచ్ఎం శ్రీదేవి అన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ ఆటలైన ఖోఖో, తొక్కుడు బిళ్ల, లూడో, చెమ్మచెక్క, అష్టచెమ్మ, రింగ్ ఆట, మేకా పులి, తాడు ఆట, ఇసుకలో పుల్ల, గట్టు బయట గట్టు లోపల, కచ్చకాయ, ఆసనాలు తదితర ఆటల పోటీలను నిర్వహించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత్త పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, నాగరత్న, పుష్పలత, వసుందర, అనురాధ, రేణుక, శంషాద్, సునీత, వేదవాణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎంఈఓ, హెచ్ఎం, సర్పంచ్ తదితరులు

కలికిరి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థినిలకు ప్రోత్సాహకంగా క్రిష్ణమ్మ మెమోరియల్ మెరిట్ స్కాలర్‌షిప్ నగదును బుధవారం అందజేశారు. 576 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిన ఎం.రుబీనాకు రూ.25 వేలు, 557, 556 మార్కులతో తరువాతి స్థానాల్లో నిలిచిన బి.వెన్నెల, సుప్రియలకు రూ.15వేలు, రూ.10వేలు స్థానిక తాత్కాలిక సర్పంచ్ యల్లప్ప చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో స్ఫూర్తి నింపడానికి దాతల కృషి వెలకట్టలేనిదని ఎంఈఓ కరీముల్లా అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జయమ్మ, యోగేష్‌రెడ్డి, సీఆర్‌పీ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి



తొక్కుడు బిళ్ల ఆడుతున్న విద్యార్థులు



తాడులాగుడు పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ : దేశ సంస్కృతిని ప్రతిబింబించే సంప్రదాయ క్రీడలను అందరూ ప్రోత్సహించాలని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. బుధవారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో శిక్ష సప్తాహ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సంప్రదాయ క్రీడా పోటీలను నిర్వహించారు. అష్టాచమ్మా, ఒంగుళ్ల దూకుళ్లు, కర్రాబిళ్ల, తొక్కుడుబిళ్ల, తాడాట వంటి క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పురాతన కాలం నంచి వస్తున్న అనేక క్రీడలు ఆడటం, వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. సంప్రదాయ క్రీడలు అందరికి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రసాదిస్తామన్నారు. వీటి వలన మనకు ఎన్నో ప్రయోజనాలు కలగడంతో పాటు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయన్నారు. హెడ్మాస్టర్ అహ్మద్‌బాషా, పీడీ రమేష్, ఉపాధ్యాయులు త్రినాథ్ రావ్, మదన్మోహన్, జావీద్‌లు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయండి

డీపీఓ ధనలక్ష్మి



తరిగొండ ఇందిరమ్మ కాలనీలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

గుర్రంకొండ : జిల్లాలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చే యాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని తరిగొండ గ్రామంలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానిక డంపింగ్ యార్డులో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం లోపం కారణంగానే జ్వరాలు ఎక్కువగా ప్రబలే ఆస్కారం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. మురుగునీటి కాలువలు, వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు తగు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనే ఉందన్నారు. ఆమె వెంట ఈఓపీఆర్‌డీ నాగేశ్వరరెడ్డి, ఈఓ విశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

రాజంపేట టౌన్ : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీఓకు యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. జీఓ ఎంఎస్ నెం.117ను రద్దు చేసి జీఓ ఎంఎస్ నెం. 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు తరగతులను ఒకే పాఠశాలలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. హైస్కూల్స్‌లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని చెప్పారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయింపు, హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియామకం, కిలోమీటరు పైబడి దూరం నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలను, బాషా వలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని తెలియజేశారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసును వెంటనే విడుదల చేయాలని, పీజీటీలకు జూనియర్ లెక్చరర్ల హోదా కల్పించాలని, మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుల సర్వీసులను రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

ముగ్గురు విద్యార్థులకు గాయాలు

మదనపల్లె : రోడ్డుప్రమాద ఘటనలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజు గొల్లపల్లెకు చెందిన విద్యార్థులు మణికంఠ(19), రెడ్డిబాబు(18), కుమార్ ఆచారి(18) ముగ్గురూ మదనపల్లెలో ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. బుధవారం ముగ్గురూ కలిసి ద్విచక్రవాహనంలో వెళుతూ మదనపల్లె బైపాస్‌రోడ్డు బోడిమల్లదిన్నె రోడ్డులో ఓ ప్రైవేట్ కాలేజీ వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపిక

మదనపల్లె : కడప జిల్లా వేంపల్లెలో జూలై 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఇంటర్‌నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు చైర్‌పర్సన్స్ అమృత, శ్రీదేవిలు తెలిపారు. బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో... పదోతరగతికి చెందిన విశాల్, రూహిత్, ఆర్యన్, తొమ్మిదోతరగతికి చెందిన రేవంత్, లిఖిత్, మహమ్మద్‌ఖాజా, మహిత్, ఇజాన్, ఎనిమిదోతరగతి చదువుతున్న లోహిత్ అన్నమయ్య జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. వీరు జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ షహనాజ్‌ఖాన్, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, జిల్లా టార్గెట్ బాల్ సెక్రటరీ మహమ్మద్ అలీ అభినందించారు.

ఒలింపిక్స్ క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్



ఒలింపిక్స్ లోగో ఆకారంలో విద్యార్థులు



ఆల్ ది బెస్ట్ చెబుతున్న క్రీడాకారులు

మదనపల్లె సిటీ : ఒలింపిక్స్ పోటీల్లో తెలుగు క్రీడాకారులు పతకాలు సాధించాలని కోరుతూ బుధవారం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒలింపిక్స్ లోగో ఆకారంలో కూర్చుని విజయం సాధించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూలై 25 నుంచి పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ గేమ్స్‌లో తెలుగు క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో సింధు, అథ్లెటిక్స్‌లో జ్యోతి గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమర్‌బాషా, గిరిధర్‌నాయక్, వేణుగోపాల్, లలితమ్మ, మంజుల, పీడీలు నాగరాజు, నరేష్ పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఒలింపిక్స్‌కు వెళ్లే క్రీడాకారులు మన దేశానికి మంచి పేరు తీసుకురావాలని, పతకాలు సాధించాలని కోరుతూ క్రీడాభారతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్రీడాకారులకు మనస్ఫూర్తిగా అభినందలు తెలియజేయాలని క్రీడాభారతి కార్యదర్శి నరేష్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు దేవకమ్మ, శరత్, మురళి,రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ పాలసీలపై అవగాహన

తంబళ్లపల్లె : ఇన్సూరెన్స్ పాలసీలపై అందరికీ అవగాహన ఉండాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో ప్రమాద, ఆరోగ్య బీమా పాలసీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ యజమాని ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే ప్రమాద సంఘటనలు జరిగినప్పుడు ఆ కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాద, ఆరోగ్య పాలసీలు చేసుకోవాలన్నారు. చిత్తూరు పోస్టల్ బ్యాంకు మేనేజర్ నాగార్జున పలు రకాల ఇన్సూరెన్స్ పాలసీలపై వివరించారు.

వన్‌టౌన్ సీఐగా ప్రసాద్



మదనపల్లె : పట్టణంలోని వన్‌టౌన్ సీఐగా ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న వలీబాషు అన్నమయ్యజిల్లా హెడ్‌క్వార్టర్స్ వీఆర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రాయచోటి నుంచి సీఐ ప్రసాద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. వన్‌టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా దుర్గలమ్మ ఊరేగింపు



రామసముద్రంలో ప్రత్యేక అలంకారంలో దుర్గలమ్మ

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వెలసిన శ్రీదుర్గలమ్మ ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీద్రౌపతిదేవి ధర్మరాజుల మహోత్సవములలో భాగంగా బుధవారం రాత్రి ద్రౌపతి ధర్మరాజుల మెరవణి, దుర్గలమ్మ మెరవణి వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చెక్కభజనలు, కోలాటాలు, చిన్నపిల్లల నృత్యాలు, భారీ బళ్లారి డ్రమ్స్ నడుమ అమ్మవారిని పుష్పపల్లకిపై తిర్పుదిద్ది ఊరేగింపు చేశారు. ఇంటింటా మహిళలు కర్పూర హారతులు అందించి, మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నడివీధి గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో నడివీధి గంగమ్మ

మదనపల్లె సిటీ : స్థానిక నిమ్మనపల్లె క్రాస్‌లో నడివీధి గంగజాతర బుధవారం ఘనంగా జరిగింది. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే జాతరలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మహిళలు అమ్మవారికి దీలు,బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దిగువకమ్మపల్లె, బసినికొండ, బర్మావీధి, సుబ్బారెడ్డి లే అవుట్ తదితర ప్రాంతాల్లోని భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సంకటహర చతుర్థి



సంకటహర చతుర్థి నిర్వహిస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ : స్థానిక గోవర్ధనగిరిలోని శ్రీ కృష్ణ ఆలయంలో సంకటహర చతుర్థి ఘనంగా నిర్వహించారు.ఆలయంలో వినాయకునికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. స్థానిక రామిరెడ్డి లేఅవుట్‌లోని శ్రీ వరసిద్ధి వినాయకుని ఆలయంలో సంకటహరచతుర్థి నిర్వహించారు. పలువురు స్వామివారిని దర్శించుకున్నారు.